నమస్తే తెలంగాణ
# జనగామ
5 | మంగళవారం 9 జనవరి 2024 | JANAGAON



ప్రధాన రోడ్డుపై ధర్నా చేస్తున్న మిర్చి రైతులు

# మిర్చి ధర.. సగానికి కోత

## మిరప రైతుల ఆందోళన

- ఎనుమాముల మార్కెట్ వద్ద రెండు గంటల పాటు రాస్తారోకో
- అధికారుల హామీతో విరమణ
- 4గంటలు కాంటాలు ఆలస్యం
- జేడీఎంతో డీసీపీ, ఏసీపీ, రైతుల సమావేశం
- తక్కువ ధర పడ్డవారివి పరిశీలన

కాశీబుగ్గ, జనవరి 8 : వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ పరిధిలోని మిర్చి రైతులు సోమవారం ఆందోళనకు దిగారు. తేజ మిర్చి క్వింటాల్‌కు జెండా పాట రూ.20,100 కాగా రూ.12వేల నుంచి రూ.17వేలకే వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారని రైతులు మండిపడ్డారు. కావాలనే మిర్చి ఖరీదు వ్యాపారులు సిండికేట్‌గా మారి నాణ్యతలేమి పేరిట తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పెద్ద ఎత్తున మిర్చి కార్యాలయం వద్దకు చేరి ఆందోళనకు దిగారు. దీంతో కాంటాలు నిలిచిపోగా మార్కెట్ ప్రాంగణంలో ఉద్రిక్త వాతావరణం చోటు చేసుకుంది. అక్కడి నుంచి ర్యాలీగా మార్కెట్ ప్రధాన కార్యాలయానికి చేరుకొని నిరసన తెలిపి ప్రధాన మార్కెట్ గేటు దగ్గరకు చేరుకున్నారు. తమకు న్యాయం చేయాలని రెండు గంటల పాటు రోడ్డుపై ధర్నా చేశారు. దీంతో ట్రాఫిక్ నిలిచిపోయి వాహనదారులకు ఇబ్బందులు తలెత్తాయి. వెంటనే ఎనుమాముల సీఐ ఏ మహేందర్ అక్కడికి చేరుకొని రైతులతో మాట్లాడి వారి సమస్యను మార్కెట్ కమిటీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోయారు. ధర్నా విరమించి అధికారులతో సమావేశం నిర్వహించేందుకు రావాలని కోరగా వారు ప్రధాన కార్యాలయానికి చేరుకున్నారు. వెంటనే జేడీఎం ఎన్నారపు మల్లేశం, డీఎంవో పాలకుర్తి ప్రసాదరావు, కార్యదర్శి క్యారం సంగయ్య, వరంగల్ డీసీపీ పుప్పాల రవీందర్, మామునూరు ఏసీపీ సీ సతీశ్‌బాబు, సీఐ మహేందర్, చాంబర్ అధ్యక్ష కార్యదర్శులు బొమ్మినేని రవీందర్‌రెడ్డి, మడూరి వేదప్రకాశ్, అడ్తి సెక్షన్ అధ్యక్షులు ఎన్‌రెడ్డి లింగారెడ్డి సంబంధిత రైతులతో సమావేశమై సమస్య తెలుసుకున్నారు. మూడు గంటలపాటు ఇరువర్గాల వారు చర్చించి తక్కువ ధర వచ్చిన రైతుల సరుకును పరిశీలించి ధరలు పెంచే విధంగా కృషి చేస్తామని, ధరలు నచ్చని రైతులు మరుసటి రోజు అమ్ముకోవాలని సూచించారు. తక్కువ ధర పడ్డ రైతుల సరుకులను పరిశీలించి కొంత వరకు ధర పెంచి కొనుగోలు చేపట్టారు. మధ్యాహ్నం నుంచి మిర్చి కాంటాలు యథావిధిగా కొనసాగాయి. సోమవారం మార్కెట్‌కు సుమారు 10వేల మిర్చి బస్తాలు వచ్చినట్లు మార్కెట్ వర్గాలు తెలిపాయి.

### మిర్చి రైతులకు న్యాయం చేయాలి

వరంగల్ మార్కెట్‌కు వ్యవసాయ ఉత్పత్తులను తీసుకువచ్చే రైతులను దోచుకుంటున్నారు. ఈ పద్ధతి మారాలి. రైతులకు న్యాయం జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. సమస్యను పరిష్కరించుకుండా నిర్లక్ష్యం చేస్తే ఆందోళనలు ఉధృతం చేస్తాం.

– సోమిడి శ్రీనివాస్, తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు



అధికారులు, మంత్రులతో సమీక్షిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

# కమలాపురం బిల్ట్‌ను పునరుద్ధరిస్తాం

## ఫ్యాక్టరీపై సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి

మంగపేట, జనవరి 8 : కమలాపురం బిల్ట్ ఫ్యాక్టరీ పునరుద్ధరణకు చేయూత అందిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లో మంత్రులు, ఉన్నత స్థాయి అధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు. 2014 ఏప్రిల్‌లో ఉత్పత్తి నిలిచిపోయిన విషయంపై చర్చించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ ఫ్యాక్టరీ ప్రారంభానికి అవసరమైన ఆర్థిక కార్యకలాపాలపై దృష్టి సారించి, కమలాపురం ప్రాంతంలో ఉపాధి అవకాశాలు మెరుగుపర్చేందుకు ప్రభుత్వం నుంచి అన్ని సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. బిల్ట్ పారిశ్రామిక యూనిట్ పునరుద్ధరణకు ఐటీసీ కూడా సహకరిస్తున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో మంత్రులు సీతక్క, కొండా సురేఖ, పీఆర్‌ఎల్‌సీ పరిశ్రమల శాఖల కార్యదర్శులు, సీఎంవో అధికారులు, ములుగు కలెక్టర్ ఇలా త్రిపాఠి పాల్గొన్నారు.

# ఐనవోలు ఎస్సై నవీన్ సస్పెన్షన్

- గంజాయి కేసు నమోదులో ఎన్‌డీపీఎస్ మార్గదర్శకాలు పాటించకపోవడంతో వేటు



సుబేదారి, జనవరి 8 : ఐనవోలు ఎస్సై వీ నవీన్‌పై సస్పెన్షన్ వేటు పడింది. ఈ మేరకు సోమవారం వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝా ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 6న ఐనవోలు మండలంలోని వనమాల కనపర్తి కెనాల్ సమీపంలో కాజీపేట బాపూజీనగర్‌కు చెందిన ఫ్రూట్స్ షాప్ నిర్వాహకుడు కిలారి శోభన్‌కుమార్, గాంధీ వరప్రసాద్, వరంగల్ ఎల్‌బీనగర్‌కు చెందిన చికెన్ సెంటర్ వర్కర్ ఎండీ పర్వేజ్ పాషా, ఐనవోలు మండలం వెంకటాపూర్ గ్రామానికి చెందిన మోటె ప్రవీణ్, వనమాల కనపర్తికి చెందిన ఓదెల సాయి కిరణ్, ఘన్‌పూర్‌కు చెందిన ప్రవీణ్, టేకులగూడేనికి చెందిన సహాలి గంజాయి విక్రయిస్తుండగా, పక్కా సమాచారంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసి 2.30 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. శోభన్‌కుమార్, పర్వేజ్‌పాషా, మోటె ప్రవీణ్, ఓదెల సాయికిరణ్ పట్టుబడగా, ప్రవీణ్, సహాలి, గాంధీ వరప్రసాద్ పరారయ్యారు. కాగా, ఈ కేసును టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఐనవోలు పోలీసులకు అప్పగించారు. అయితే ఎస్సై నవీన్ ఎన్‌డీపీఎస్(నార్కో డ్రగ్స్ ప్రివెన్షన్ సెక్షన్) మార్గదర్శకాలు పాటించకుండా నిందితులపై కేసు నమోదు చేశారు. దీంతో ఎస్సై నవీన్‌పై సస్పెన్షన్ వేటు వేశారు. అలాగే ఐనవోలు ఎస్సైగా అనిల్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అనిల్ ప్రస్తుతం వీఆర్‌లో ఉన్నారు.



మండపారాధన పూజల్లో పాల్గొన్న అర్చక దంపతులు

# మల్లికార్జునుడికి బిల్వార్చన

## కల్యాణోత్సవాలు సమాప్తం



చేర్యాల, జనవరి 8 : కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయంలో సోమవారం స్వామి వారికి లక్ష బిల్వార్చన, మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం ఘనంగా నిర్వహించారు. కల్యాణం మరుసటి రోజు ఆలయ సంప్రదాయం మేరకు లక్ష బిల్వార్చన చేశారు. అనువంశిక వీరశైవ ఆగమ శాస్త్రం ప్రకారం స్వామి వారి ఆలయంలో స్వస్తిక్ పుణ్యాహవాచనం, గణపతి పూజ, పంచచార్య పూజలు, రుద్రాభిషేకం, బిల్వార్చన, మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం, హారతి, మంత్రపుష్పం, మహా నైవేద్యం తదితర కార్యక్రమాలు చేశారు. బిల్వాలను స్వామి మూలవిరాట్ వద్ద సమర్పించి 1008 మల్లన్న నామస్మరణతో పూజలు కొనసాగించారు. అర్చకుడు మహాదేవుని శ్రీనివాస్, మనోహర్ దంపతులు, ఆలయ ఈవో ఏ బాలాజీ, ఏఈవోలు వైరాగ్యం అంజయ్య, గంగా శ్రీనివాస్, ప్రధానార్చకుడు మహాదేవుని మల్లికార్జున్, పర్యవేక్షకుడు నీల శేఖర్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

**వేడుకలు ముగింపు**

రెండు రోజుల వైభవంగా జరిగిన కల్యాణోత్సవాలు సోమవారం ముగిసినట్లు అర్చకులు ప్రకటించారు. సంక్రాంతి పర్వదినం అనంతరం వచ్చే మొదటి ఆదివారం రోజున పట్నం వారంతో తిరిగి జాతర ఉత్సవాలు ప్రారంభమవుతాయని చెప్పారు. మొదటి ఆదివారం పట్నం వారం సందర్భంగా హైదరాబాద్ భక్తులు పట్నం, అగ్నిగుండాల కార్యక్రమాలు నిర్వహించుకుంటారని వెల్లడించారు.




వరంగల్ జిల్లా చెన్నారావుపేట తహసీల్దార్ వద్ద బిల్లులు చెల్లించాలని ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న గృహలక్ష్మి లబ్ధిదారులు

# గృహలక్ష్మిని కొనసాగించాలి

## వెంటనే బిల్లులు చెల్లించాలని డిమాండ్

- వరంగల్ జిల్లాలో తహసీల్ కార్యాలయాల వద్ద లబ్ధిదారుల నిరసన
- తహసీల్దార్లకు వినతిపత్రాల అందజేత

నర్సంపేట రూరల్/చెన్నారావుపేట/నల్లబెల్లి/ఖానాపురం: కేసీఆర్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన గృహలక్ష్మీ పథకాన్ని తిరిగి కొనసాగించాలని, వెంటనే బిల్లులు చెల్లించాలని పలువురు లబ్ధిదారులు డిమాండ్ చేశారు. సోమవారం వరంగల్ జిల్లాలోని నర్సంపేట, చెన్నారావుపేట, నల్లబెల్లి, ఖానాపురం మండలాల్లోని గృహలక్ష్మి లబ్ధిదారులు తహసీల్దార్ కార్యాలయాల వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్లకు అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ గృహలక్ష్మీ పథకంలో భాగంగా అర్హులైన చాలా మంది నూతన ఇంటి నిర్మాణాలు చేపట్టారన్నారు. కొందరివి పిల్లర్లు, మరికొందరివి స్లాబ్ లెవల్ వరకు పూర్తయ్యాయని తెలిపారు. వాటి బిల్లులు అందక లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, తక్షణమే కాంగ్రెస్ ప్రభుత్వం గృహలక్ష్మీ పథకాన్ని తిరిగి కొనసాగించి బిల్లులు అందేలా చూడాలని డిమాండ్ చేశారు. చెన్నారావుపేట మండలంలోని 31 గ్రామాల్లో గృహలక్ష్మీ పథకం కింద ఇల్లు నిర్మాణం ప్రారంభించిన ప్రతి ఒక్క లబ్ధిదారుడికి ప్రభుత్వం వెంటనే బిల్లు చెలించి ఆదుకోవాలని తహసీల్దార్ ఫణికుమార్‌కు వినతి పత్రం అందజేశారు. అలాగే నర్సంపేట మండల తహసీల్ కార్యాలయంలో వందలాది గృహలక్ష్మీ పథక లబ్ధిదారులు ధర్నా చేసి తహసీల్దార్ విశ్వప్రసాద్‌కు వినతిపత్రం అందించారు. నల్లబెల్లి మండలంలో మంజూరైన 328 మంది నిరుపేదలకు గృహలక్ష్మీ పథకం కింద ఇండ్లకు సంబంధించి బిల్లులు చెల్లించాలని తెలంగాణ ఉద్యమకారుడు బట్టు సాంబయ్య డిమాండ్ చేశారు. ఈమేరకు తహసీల్దార్ రాజేశ్‌కు లబ్ధిదారులందరూ కలిసి వినతిపత్రం అందజేశారు. ఖానాపురం తహసీల్దార్ కిరణ్‌కుమార్, ఎంపీడీఓ సుమనా వాణిలకు వినతిపత్రం ఇచ్చారు.



వరంగల్ జిల్లా నర్సంపేట తహసీల్దార్ విశ్వప్రసాద్‌కు వినతిపత్రం అందజేస్తున్న లబ్ధిదారులు

# నిరుద్యోగులకు అండగా నిలుస్తాం

- స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌తో స్వయం ఉపాధికి సమగ్ర శిక్షణ
- ప్రభుత్వ విప్‌లు, ఎమ్మెల్యేలు
- గుర్తూరులో వైభవంగా భూమి పూజ, పనుల ప్రారంభం
- ఏడాదిలోగా పూర్తి చేస్తాం : ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి

తొర్రూరు, జనవరి 8: స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటుతో పాలకుర్తి నియోజకవర్గంలోని నిరుద్యోగ యువత, మహిళలకు ఉపాధి లభిస్తుందని ప్రభుత్వ విప్‌లు, డోర్నకల్, ఆలేరు ఎమ్మెల్యేలు జాటోత్ రామచంద్రూనాయక్, బీర్ల అయిలయ్య, మునుగోడు, మహబూబాబాద్, వర్ధన్నపేట నియోజకవర్గాల ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, మురళీనాయక్, కేఆర్ నాగరాజు అన్నారు. సోమవారం మండలంలోని గుర్తూరు గ్రామ శివారులో తమ సొంత వ్యవసాయ క్షేత్రంలో ఏర్పాటు చేయనున్న స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్, అనాథాశ్రమానికి కాంగ్రెస్ పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎన్నారై హనుమాండ్ల ఝూన్సీ రాజేందర్‌రెడ్డి దంపతులు, పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి రాజారాంమోహన్‌రెడ్డి దంపతుల ఆధ్వర్యంలో భూమి పూజ చేశారు. పనులు ప్రారంభించారు. అనంతరం ప్రభుత్వ విప్‌లు, ఎమ్మెల్యేలు మాట్లాడుతూ.. ఈ ప్రాంతానికి చెందిన హనుమాండ్ల ఝూన్సీరాజేందర్‌రెడ్డి అమెరికాలో ఉంటూ తాము సంపాదించిన దాంట్లో నుంచి కొంత మొత్తాన్ని విరాళంగా ఇస్తూ అనేక ప్రాంతాల్లో భవనాలు కట్టించి ప్రభుత్వ దవాఖానలు, ప్రభుత్వ పాఠశాలలకు అందించడంతో పాటు పేద విద్యార్థులను చదువులో ప్రోత్సహిస్తున్నారన్నారు. ఇలాంటి గొప్ప మనసు ఉన్న వాళ్లు రాజకీయాల్లోకి రావడం అభినందనీయమన్నారు. పాలకుర్తి నియోజకవర్గంలోని నిరుద్యోగ యువత, మహిళలకు ఉపాధి కల్పించేందుకు స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్న హనుమాండ్ల ఝూన్సీ రాజేందర్‌రెడ్డి అయిన మా అత్త, మామలకు తోడుగా ఉంటానని పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో యువతకు ఇచ్చిన హామీ మేరకు స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌కు భూమి పూజ చేశామన్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జి ఝూన్సీ రాజేందర్‌రెడ్డి దంపతులు మాట్లాడుతూ.. స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏడాదికాలంలో పూర్తి చేసి, సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రుల చేతుల మీదుగా ప్రారంభించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జనగామ, వరంగల్ జిల్లాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, ఎర్రబెల్లి స్వర్ణ, మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య, నాయకులు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.



తొర్రూరు మండలం గుర్తూరులో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌కు శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న ప్రభుత్వ విప్‌లు రామచంద్రూనాయక్, అయిలయ్య, ఎమ్మెల్యేలు

# మిషన్ హాస్పిటల్ స్థలం కబ్జాకు యత్నం

- ఉద్యోగులను గెంటివేసి, సామాన్లు బయట పడేసిన వైనం
- న్యాయం చేయాలని రోడ్డెక్కిన బాధితులు





హనుమకొండలోని బాప్టిస్ట్ హాస్పిటల్

హనుమకొండ చౌరస్తా, జనవరి 8: వందేళ్ల చరిత్ర ఉన్న హనుమకొండలోని మిషన్ హాస్పిటల్ స్థలాన్ని కబ్జా చేసేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారు. రూ.కోట్ల విలువైన 12 ఎకరాల ప్రభుత్వ భూములను కాజేసేందుకు క్వార్టర్స్‌లో ఉంటున్న తమను వెళ్లగొట్టారని బాధితులు గనిపాక హేమలత, విజయలక్ష్మి సోమవారం ఆవేదన వ్యక్తంచేశారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. మిషన్ హాస్పిటల్‌లో పనిచేసిన ఉద్యోగులకు అందులోనే ఉండేందుకు క్వార్టర్స్ నిర్మించి ఇవ్వగా, 40 ఏళ్లుగా అందులోనే ఉంటున్నామని చెప్పారు. సేవ చేయడానికి వచ్చి ఆక్రమిస్తున్నారని వారు ఆరోపించారు.

క్వార్టర్స్‌లో ఉంటున్న ఉద్యోగులకు ముందస్తు సమాచారం లేకుండా ఇంటి సామగ్రి బయటపడేసి, గెంటివేశారని వాపోయారు. భూములు కబ్జా కాకుండా 2014లో ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్ కాపాడారని, ఇప్పుడు కొంతమంది స్వార్థం కోసం మళ్లీ తమను వెళ్లగొడుతున్నారని వారు కన్నీటిపర్యంతమయ్యారు. ఇక్కడే పుట్టి, పెరిగామని తమ తల్లిదండ్రులు ఇందులోనే దోబీలుగా పనిచేశారని తమకు ప్రత్యామ్నాయం చూపకుండా అకారణంగా పంపించేసి భూములను లాక్కోవాలని చూస్తున్నారని వారు మండిపడ్డారు. 2014లో చర్చి సభ్యులు మిషన్ హాస్పిటల్‌ను తీసుకుని ట్రస్ట్ ఏర్పాటు చేసి నడిపిస్తున్నారని, వారికి ఎలాంటి సంబంధం లేకున్నా హాస్పిటల్‌ను మళ్లీ నడిపిస్తున్నారని, ఇందులో పనిచేసే సివిల్ ఇంజినీర్, డ్రైవర్ దౌర్జన్యం చేస్తూ దుర్భాషలాడుతున్నారని ఆరోపించారు. నర్సుగా ఇక్కడ రూ.9వేలకు పనిచేశామని ఎలాంటి ఉద్యోగ భద్రత కల్పించకుండా ఇక్కడినుంచి వెళ్లిపోవాలని బయటకు గెంటేశారని ఆవేదనతో చెప్పారు.

### అది మిషనరీస్ స్థలం

మిషన్ హాస్పిటల్‌కు సంబంధించిన ల్యాండ్ ప్రభుత్వ భూమి కాదు. మొత్తం తొమ్మిది ఎకరాలు మిషనరీస్‌దే. మా దగ్గర పత్రాలు కూడా ఉన్నాయి. శిథిలావస్థలో క్వార్టర్స్‌ను ఆధునీకరిస్తున్నాం. హాస్పిటల్‌లో పనిచేసిన ఉద్యోగులు ఎవరూ లేరు. అక్కడినుంచి వెళ్లిపోయారు.

– డాక్టర్ క్రిష్టోఫర్, హనుమకొండ సెంటినరీ బాప్టిస్ట్ చర్చి ప్రెసిడెంట్



చెప్పకుండా సామాన్లు బయటపడేయడంతో అక్కడ పనిచేసేవారితో గొడవ పడుతున్న బాధితులు

# వైద్యవిద్యార్థి సైఫ్ సస్పెన్షన్ కొనసాగింపు

- కోర్టు ఆదేశానుసారం పునఃవిచారణ చేపట్టిన యాంటీ ర్యాగింగ్ కమిటీ
- జూన్ 8వ తేదీ వరకు సస్పెన్షన్ ఉత్తర్వులు పొడిగింపు

వరంగల్ చౌరస్తా, జనవరి8: కాకతీయ మెడికల్ కళాశాల పీజీ మొదటి సంవత్సరం అనస్థీ షియా విద్యార్థిని ధరావత్ ప్రీతి ఆత్మహత్య కేసు విచారణలో యాంటీ ర్యాగింగ్ కమిటీ సోమవారం పునఃవిచారణ జరిపి సైఫ్ సస్పెన్షన్ కొనసాగించాలని నిర్ణయించింది. ప్రీతిని వేధించాడని సెకండియర్ అనస్థీషియా విద్యార్థి సైఫ్ అలీపై వచ్చిన ఆరోపణల్లో వాస్తవం ఉందని నమ్మిన కమిటీ గతంలో తీసుకున్న నిర్ణయాన్ని సమర్థిస్తూ సస్పెన్షన్ సరైనదిగా మరోమారు తీర్మానించింది. తాను రిమాండ్‌లో ఉన్న సమయంలో యాంటీ ర్యాగింగ్ కమిటీ తనను విచారించకుండానే తీర్మానం చేసినట్లు సైఫ్ అలీ హైకోర్టులో తెలియజేయడంతో న్యాయమూర్తి నిందితుడిని సైతం విచారించి తగు తీర్మానం చేయాలని సూచిస్తూ ఆదేశాలు జారీ చేయడంతో పునఃవిచారణ చేపట్టారు. మొదటిసారి విచారణకు హాజరు కాకపోవడంతో వాయిదా వేసి, మరో అవకాశాన్ని కల్పించింది. సోమవారం మరోసారి నిందితుడి తరపు లాయర్ ముందే విచారించిన కమిటీ గతంలో చేసిన తీర్మానం సరైనదేనని తేల్చుతూ మరో తీర్మానం చేసింది. దాంతో పాటుగా కోర్టు ఉత్తర్వుల అనంతరం విచారణకు హాజరుకాకుండా విధులకు హాజరైన 97 రోజుల కాలాన్ని సైతం కలుపుకొని 2024 జూన్8వ తేదీ వరకు సస్పెన్షన్ కాలాన్ని పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు కేఎంసీ ప్రిన్సిపాల్ మోహన్‌దాస్ ఒక ప్రకటనలో తెలిపారు.

# రిటైర్డ్ ఎక్సైజ్ సీఐపై అట్రాసిటీ కేసు

## అమ్మిన స్థలం చూపించమన్నందుకు కులం పేరుతో దూషించాడని బాధితుడి ఫిర్యాదు

ఖిలావరంగల్, జనవరి 8 : విక్రయించిన స్థలం ఎక్కడుందో చూపెట్టాలని అడిగినందుకు ఓ రిటైర్డ్ ఎక్సైజ్ సీఐ కులం పేరుతో దూషించాడని బాధితుడు ఫిర్యాదు చేశాడు. దీంతో మిల్స్‌కాలనీ పోలీసులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. బాధితుడు సమ్మయ్య తెలిపిన వివరాల ప్రకారం.. పెరికవాడకు చెందిన రిటైర్డ్ సీఐ దిడ్డి నరేందర్ 2012లో మాకు సాకరాశికుంటలో 2 వేల గజాల స్థలాన్ని విక్రయించాడు. ఇందు కోసం రెండు విడుతలుగా రూ.10 లక్షలు ఇచ్చి రోడ్డుకు ఆనుకొని ఉన్న స్థలం ఇచ్చేందుకు ఒప్పందం కుదుర్చుకున్నాం. అలాగే 1995 నుంచి పది అడుగుల లోతు ఉన్న సాకరాశి కుంటను మొరం మట్టితో పూడ్చేందుకు రూ.కోటికిపైగా ఖర్చు కాగా, అందుకు బదులుగా మూడు వేల గజాల స్థలం రోడ్డుకు లోపలి వైపు ఉన్న స్థలం ఇచ్చేలా మాట్లాడుకున్నాం. ఇదే కుంటపై గొడవలు, కోర్టు కేసులు ఉండడం వల్ల మాకు ఇచ్చే స్థలం తర్వాత ఇస్తామంటూ దాట వేసుకుంటూ వచ్చాడు. ఈ క్రమంలో ఆదివారం నరేందర్ సాకరాశికుంట వద్దకు వచ్చి ప్లాట్లలో మట్టి పోయిస్తుంటే మాకు ఇచ్చిన ప్లాట్లు ఎక్కడున్నాయో చూపెట్టిన తర్వాతనే ప్లాట్ల పనులు చేసుకోవాలని అడ్డుకున్నాం. మీకు ప్లాట్లు ఇచ్చేది లేదు, డబ్బులు ఇచ్చినట్లు ఏమైనా డాక్యుమెంట్లు ఉంటే తీసుకురావాలని చెప్పడంతో ఒప్పందం చేసుకున్న పత్రాన్ని తీసుకువచ్చి ఇచ్చాం. అయినప్పటికీ మీకు ప్లాట్లు ఇచ్చేది లేదు, ఎవరికైన చెప్పుకో అంటూ కులం పేరుతో దూషించి నెట్టివేసినట్లు బాధితుడు తెలిపాడు. సమ్మయ్య ఫిర్యాదు మేరకు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు మిల్స్‌కాలనీ సీఐ సురేశ్ తెలిపారు.

› మరిన్ని జిల్లా వార్తలు 8వ పేజీలో